## అక్రమంగా మట్టి తరలిస్తున్న సంస్థపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 12: అక్రమంగా మట్టి తరలించి అమ్ముకుంటున్న ఓ సంస్థపై కేసు నమోదైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వి.అశోక్ కథనం ప్రకారం.. నారపల్లి సమీపంలోని ఎంజేఆర్ థియేటర్ ఎదురుగా ఉన్న జైన్ కన్‌స్ట్రక్షన్ సంస్థ నిర్మాణాల నుంచి అక్రమంగా మట్టిని ఇతర చోటకు తరలించి అమ్ముకుంటున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో ఆ సంస్థపై కేసు నమోదు చేశారు. జైన్ నిర్మాణాల నుంచి ఘనపూర్ పంచాయతీ పకీర్ టెక్యా తండాలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన ఇండ్ల నిర్మాణానికి తరలిస్తున్నట్లు తాసీల్దార్ సందీప్ కుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 12 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పోచారం ఐటీసీ పీఎస్ పరిధిలో జరిగింది. పోచారం ఐటీసీ ఇన్‌స్పెక్టర్ వి.అశోక్ రెడ్డి కథనం ప్రకారం.. యంనంపేట్ గ్రామానికి చెందిన బండారి బాల్‌రాజు (46) ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్నాడు. ఈ నెల 6న కళాశాల పనిపై ఘట్‌కేసర్ వెళ్తున్నాడు. రాక్‌వుడ్ స్కూల్ వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలు కావటంతో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఘనంగా జాతీయ యువజన దినోత్సవం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

మేడ్చల్ జోన్ బృందం, జనవరి 12 : స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన దినోత్సవాన్ని వివిధ పార్టీలు, పలు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్, శామీర్‌పేట మండలాల్లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బలమే జీవితం, బలహీనతే మరణమని వివేకానంద చెప్పారన్నారు. పిన్న వయస్సులోనే దేశ, విదేశాల్లో భారత జాతి ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహనీయుడన్నారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకొని సమాజ ప్రగతి కోసం పాటుపడాలని సూచించారు. మేడ్చల్‌లో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ రమేశ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో వివేకానంద జయంతిని చైర్మన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మైసమ్మగూడలోజరిగిన వేడుకల్లో కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు. మూడుచింతలపల్లి మండలం కేశ్వాపూర్-తూంకుంట ప్రధాన కూడలిపై దాత, రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరెడ్డి ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహాన్ని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హారిక మురళీగౌడ్, జడ్పీటీసీ అనిత లాలయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, సర్పంచులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని మేడ్చల్, కీసర, ఘట్‌కేసర్ మండలాల పరిధిలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, సర్పంచులు , నాయకులు పాల్గొన్నారు.

కేశ్వాపూర్-తూంకుంట చౌరస్తాలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

**మల్కాజిగిరి, ఉప్పల్ నియోజకవర్గంలో..**

నేరేడ్‌మెట్ : మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం నిర్వహించారు. గౌతంనగర్ డివిజన్‌లో నిర్వహించిన వివేకానంద జయంతికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతా రామయాదవ్ హాజరై వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్. జగదీష్‌గౌడ్, నాయకులు రామయాదవ్, సిద్దిరాములు, నర్సింగ్, నాయకులు పాల్గొన్నారు.

- ఉప్పల్ : స్వామి వివేకానంద యువతకు మార్గదర్శకంగా నిలుస్తారని మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా హబ్సిగూడలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు రఘుపతి రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, శ్రవణ్ పాల్గొన్నారు.
- కాప్రా : మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ ఫేజ్-1 ప్రధాన కూడలిలో నిర్వహించిన వివేకానంద జయంతి కార్యక్రమంలో వివేకానంద విగ్రహానికి కార్పొరేటర్ జే.ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, స్థానిక నాయకులు పూలమాల వేసి నివాళుర్పించారు. అలాగే కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు.
- చర్లపల్లి : తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్‌లోని ఎన్వీ భాస్కర్‌రావు భవనంలో స్వామి వివేకానంద జయంతి, ప్రముఖ కవి అలిశెట్టి ప్రభాకర్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీర్జాదిగూడ మేయర్ వెంకట్‌రెడ్డి

## స్వచ్ఛ కార్మికుల సేవలు అభినందనీయం

పీర్జాదిగూడ, జనవరి12 : స్వచ్ఛ పీర్జాదిగూడగా తీర్చిదిద్దడంలో స్వచ్ఛ కార్మికుల సేవలు అభినందనీయమని మేయర్ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్, అధికారుల ఆధ్వర్యంలో చెత్త సేకరణపై వార్డు ఆఫీసర్లు, స్వచ్ఛ ఆటో కార్మికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పెరుగుతున్న కాలుష్యం పై ప్రజలకు అవగాహన కల్పించాలని రోడ్లు, ఖాళీ ప్రదేశాలపై చెత్త వేసేవారికి జరిమానా విధించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, హరిశంకర్‌రెడ్డి అనంతరెడ్డి, బచ్చరాజు, ఈశ్వర్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, స్వచ్ఛ కార్మికులు పాల్గొన్నారు.

## సన్మానం..

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జాతీయ యువజన దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అతి పిన్న వయస్సులో వివిధ దేశాల్లోని పర్వతాలను అధిరోహించిన పర్వతారోహకుడు జి.సురేశ్‌బాబుకు యంగ్ అచీవర్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా సురేశ్ బాబును, అన్నిరకాలుగా వెన్నుతట్టి ప్రోత్సహించిన డాక్టర్ జి.ఎన్. జగన్‌ను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సన్మానించారు.

– నేరేడ్‌మెట్, జనవరి 12

## రాములవారి అక్షింతలు పంపిణీ

మల్కాజిగిరి, జనవరి 12 : అయోధ్య శ్రీరాములవారి అక్షింతలను కార్పొరేటర్ శ్రావణ్ శుక్రవారం మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాస్, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున్, రవి పాల్గొన్నారు.

## దుప్పట్లు, నిత్యావసరాలు పంపిణీ

పట్టణ పరిధిలోని కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఫిస్ట్ ఏ ఫీస్ట్, వింటర్ వార్మ్ కార్యక్రమం ద్వారా సేకరించిన దుప్పట్లు, నిత్యావసరాలు పంచి పెట్టారు. మేడ్చల్, అత్వెల్లి, కండ్లకోయలోని నిరుపేదలకు 5 క్వింటాళ్ల బియ్యం, 50 కిలోల పప్పులు, 35 ఉలెన్ దుప్పట్లను నిరుపేదలు, యాచకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ రాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రేమ్‌చంద్, ప్రిన్సిపాల్ భవానీ సుబ్బరత్నం, రెక్టర్ డాక్టర్ కల్నల్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. - మేడ్చల్, జనవరి 12

ఎదులాబాద్ పంచాయతీ కార్మికులకు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కానుగంటి శ్రీనివాస్ శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని సంక్రాంతి సందర్భంగా కార్మికులకు నెల రోజులకు సరిపడా సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాలేరు సురేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. - ఘట్‌కేసర్ రూరల్, జనవరి 12

## పాలిటీవ్ కేర్ సర్వీసెస్‌కు ప్రాధాన్యత

శామీర్‌పేట, జనవరి 12 : సమాజంలో పాలిటీవ్ కేర్ సర్వీసెస్‌కు ప్రాధాన్యత ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథ్ స్వామి తెలిపారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లోని పాలిటీవ్ కేర్ సర్వీసెస్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాలిటీవ్ కేర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్వార్, గిరికాంత్ మాత్యు, రాపర్తి రమేశ్, వినయ్‌కుమార్, సిస్టర్ దీనా పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఘట్‌కేసర్, జనవరి 12: సమాజ మార్పులో యువత భాగస్వాములు కావాలని పోచారం ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి సూచించారు. శుక్రవారం అన్నోజిగూడ లక్ష్మీనర్సింహ కాలనీలో సిబ్బందితో కలిసి పర్యటించారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్సై నాగార్జున రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పీజేఆర్ చిరస్మరణీయుడు

ప్రజల హక్కుల కోసం పోరాడిన పి. జనార్దన్ రెడ్డి(పీజేఆర్)చిరస్మరణీయుడని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం అల్వాల్ కార్యాలయంలో పీజేఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి మాజీ చైర్మన్ పూలమాలవేసి నివాళులర్పించారు. - మల్కాజిగిరి, జనవరి 12



ఆలయ ధర్మకర్త లక్ష్మణాచార్యులను సన్మానిస్తున్న బట్టె లక్ష్మణ్ దంపతులు

## ఘనంగా కుడారే ఉత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 12 : ఎదులాబాద్‌లోని శ్రీగోదా సమేత శ్రీమన్నారు రంగనాయకస్వామి దేవాలయంలో కుడారే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఎదులాబాద్ శ్రీ గోదా సమేత శ్రీమన్నారు రంగనాయక స్వామిని ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భక్తులు దర్శించుకొని అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త లక్ష్మణాచార్యుల దంపతులను ఆలయ ప్రాంగణంలో దాత బట్టె లక్ష్మణ్ దంపతులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గోవిందాచార్యులు, శేషాచార్యులు, ఆదిత్యాచార్యులు పాల్గొన్నారు.

## నాలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

చర్లపల్లి డివిజన్ శ్రీసాయి కృష్ణ ఎన్‌క్లేవ్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

చర్లపల్లి, జనవరి 12 : నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీసాయి కృష్ణ ఎన్‌క్లేవ్, విరాట్‌నగర్‌లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని శ్రీసాయి కృష్ణ ఎన్‌క్లేవ్, విరాట్‌నగర్ కాలనీలోని నాలాలో వ్యర్థాలను పోసి నాలాను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు తన దృష్టికి వచ్చిందని, వెంటనే తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్ పరిధిలోని నాలాలను కబ్జా చేస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని, వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధక్ష్య, కార్యదర్శులు కుమార్‌స్వామి, తిరుమల్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్ చౌదరి, బీఆర్ఎస్ నాయకుడు కనకరాజుగౌడ్‌లతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

మల్కాజిగిరి, జనవరి 12: విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం లోతుకుంటలోని సబ్‌స్టేషన్ ఇంజినీర్‌లతో నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. ఇండ్లు, ఓపెన్ ప్లాట్స్, ఫ్లాట్స్ పైనుంచి వెళుతున్న విద్యుత్ తీగలవల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే తీగలను మార్చాలన్నారు. విద్యుత్ కనెక్షన్‌లు ఎక్కువగా ఉన్న కాలనీల్లో సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ భరత్, లైన్‌మెన్ భిక్షపతి, నాయకులు హరీశ్ గౌడ్, శేఖర్‌గౌడ్, నరేశ్, నవీన్, మల్లేశ్‌గౌడ్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అధికారులకు వినతి

కీసర, జనవరి 12: అంకిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని, సర్కారు భూమిని పరిరక్షించాలని గ్రామస్తులు జిల్లాస్థాయి అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లోని అధికారులకు ఫిర్యాదు చేసిన వారిలో అంకిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ మహేశ్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు నారాయణ,శ్రీశైలం, రాజు, సత్తయ్య, బాల్‌రాం, హరీశ్, వంశీ, పి.సత్యనారాయణ, జి.నవీన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## సమన్వయంతో పనిచేయాలి

ఉప్పల్, జనవరి 12 : సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ అన్నారు. నాచారం వార్డు కార్యాలయంలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లపై చెత్త లేకుండా చూడాలని, కాలనీవాసులకు అవగాహన కల్పించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సాయిజెన్ శేఖర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, జవాన్లు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

చర్లపల్లి, జనవరి 12 : శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కుషాయిగూడ ఆధ్వర్యంలో ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ, బీజేఆర్ కాలనీ, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో అయోధ్య శ్రీరామ స్వర్ణ అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని ట్రస్టు ప్రతినిధులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు చల్లా ప్రభాకర్, చిత్తారి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రహీం, నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'లిటిల్ ఫ్లవర్'లో క్రీడోత్సవాలు

ఉప్పల్, జనవరి 12 : ఉప్పల్ లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో క్రీడోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధ్యప్రదేశ్ మాజీ డీజీపీ మరియాకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు చేపట్టారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ ప్రకాశ్, జోసఫ్, ఎంఏ.జార్జ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అండగా ఉంటాం

**మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి**

మల్కాజిగిరి, జనవరి 12: ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడుతామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి చికెన్, మటన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్నేహ చికెన్ సంస్థ నూతన బ్రాంచ్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ.. వినాయక్‌నగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్థానిక వ్యాపారులకు మద్దతుగా ఉంటామన్నారు.

- మల్కాజిగిరి డివిజన్ ఆర్‌కే నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో సీనియర్ సిటిజన్స్ లైబ్రరీని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. విష్ణుపురంలో రిటైనింగ్ వాల్, సీసీ రోడ్లు, స్లాబ్స్ ఏర్పాటు చేస్తామన్నారు.
- బోయిన్‌పల్లి క్యాంపు ఆఫీస్‌లో అజ్మీర్ దర్గాకు చాదర్‌ను ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎమ్మెల్యే పంపించారు.
- బొల్లారం కృష్ణానగర్‌కు చెందిన మహేందర్ బాబుకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.80 వేల పత్రాలను లబ్ధిదారుడికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అందజేశారు.
- గౌతంనగర్ డివిజన్ ఐఎన్ నగర్‌లోని శ్రీజయగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం స్థల వివాదం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చట్టపమైన హక్కుల కోసం పోరాడుతామని తెలిపారు.
- నేరేడ్‌మెట్ రైల్వేస్టేషన్ వద్ద మురుగు నీటి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీతరాము యాదవ్, రాజ్యలక్ష్మి, మురుగేశ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, చికెన్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, మటన్ షాప్స్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, దినేశ్, శైలేందర్, ఈఆర్ సతీశ్, అబ్దుల్ రషీద్, ఈఆర్ సాయికుమార్, పరశురాంరెడ్డి, రాముయాదవ్, హదాయత్, శ్యామ్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, అజయ్‌గౌడ్, పాషా, కన్నాయాదవ్, సురేశ్, కొండల్,నరేందర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సోహైల్, యాదగిరి, మహేందర్ బాబు పాల్గొన్నారు.

వినాయక్‌నగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న మల్కాజిగిరి చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్‌కు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## ప్రహరీ తొలగింపు

గౌడవెల్లిలో అక్రమ కట్టడాన్ని గ్రామ పంచాయతీ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. గ్రామ శివారులోని మకుట డెవలపర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెంచర్‌కు ప్రహరీ, గేట్ ఏర్పాటు చేశారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌కు ఏర్పాటు చేసిన ప్రహరీ తొలగించాలని గతంలో నోటీసులు అందించామని తెలిపారు. ఈ విషయమై ఫిర్యాదు రావడంతో శుక్రవారం ప్రహరీ, గేటును తొలిగించినట్లు పంచాయతీ కార్యదర్శి శాంతి పేర్కొన్నారు.

- మేడ్చల్ రూరల్, జనవరి 12

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాప్రా, జనవరి 12 : మౌలాలి సబ్‌స్టేషన్ 11కేవీ మీర్‌పేట్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సబ్‌స్టేషన్ ఏఈ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మీర్‌పేట్, తిరుమలనగర్,శ్రీనగర్ పార్ట్, ఎంఐజీ, తిరుమలనగర్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సంక్రాంతి ముగ్గుల పోటీలు

నాచారంలోని సరస్వతీనగర్‌లో..

కాప్రా, జనవరి 12: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలనగర్ పాఠశాల మైదానంలో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలను కార్పొరేటర్ జె.ప్రభుదాస్ పరిశీలించారు. గెలుపొందిన ముగ్గురు విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం శ్రీనివాస్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, సెక్రటరీ అమరేందర్‌బాబు పాల్గొన్నారు.

- ఉప్పల్ : నాచారంలోని సరస్వతీనగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ హాజరయ్యారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, డీసీబీ బ్యాంక్ మేనేజర్ విజయసారథి, కాలనీ అధ్యక్షుడు వనం జయరాజ్, నాగభూషణం, డివిజన్ అధ్యక్షుడు ముత్యంరెడ్డి పాల్గొన్నారు.
- శామీర్‌పేట : తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్ పరిధిలోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ నీరజ మైకల్ తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

## పేదలకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి

చర్లపల్లి, జనవరి 12 : పేదలకు సౌకర్యాలు కల్పించేందుకు యూఎస్ఏ తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం కృషి చేస్తుందని టీడీఎఫ్ యూఎస్ఏ అధ్యక్షుడు డాక్టర్ దినేశ్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు కవిత, మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సరస్వతి శిశుమందిర్ స్కూల్ సంక్రాంతి సందర్భంగా రంగవల్లులు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భవన్స్ శారద ట్రస్ట్ వైద్యశాలకు ఆక్సిజన్ కాన్సెంట్రేటర్‌ను అందజేశారు. టీడీఎఫ్, యూఎస్ఏ ఇండియా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు, హెచ్ఎం రాధిక, వైద్యశాల సూపరింటెండెంట్ రామారావు, మేనేజర్ శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు.